

పనికి తగ్గ గుర్తింపు ఇవ్వాలి

ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్న తమకు తగిన గుర్తింపు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులు విజ్ఞప్తి చేశారు. 10లో



సంఘటితంగా పోరాడాలి

జీపీ సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలని జీపీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. 10లో




పర్మినెంట్ చేయాలి

సమగ్ర శిక్షా ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరాయి. 10లో

జబ్బుల ముప్పు

ఒంటికి కరువైన వ్యాయామం

- మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు
- చిన్న వయసులోనే వెంటాడుతున్న రుగ్మతలు
- రోజురోజుకూ పెరుగుతున్న కిడ్నీ, కేన్సర్ కేసుల సంఖ్య
- ఆరోగ్యశ్రీ ద్వారా జిల్లాలో ఏడాదిలోనే 43,070 చికిత్సలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: మారిన జీవనశైలి.. ఆహారపు అలవాట్లు.. వాతావరణ కాలుష్యం.. శరీరానికి కనీస వ్యాయామం లేకపోవడం.. పని ఒత్తిడి.. వెరసి జిల్లావాసుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఒకప్పుడు ఆరు పదుల వయసు దాటినవారిలో మాత్రమే వెలుగు చూసే జబ్బులు.. ప్రస్తుతం చిన్న వయసులోనూ వెలుగు చూస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. 2023 డిసెంబర్ 7 నుంచి 2024 డిసెంబర్ 1 వరకు ఆరోగ్యశ్రీ కింద వివిధ ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకున్న వారి జాబితాను పరిశీలిస్తే ఈ అంశం స్పష్టమవుతోంది. ఇతర జిల్లాలతో పోలిస్తే బాధితుల సంఖ్య ఇక్కడే ఎక్కువగా నమోదవుతోంది.

ఆ రుగ్మతలే అధికం..

ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు చేయించుకున్న బాధితుల జాబితాను పరిశీలిస్తే.. జిల్లాలో మూత్ర పిండాల సంబంధిత చికిత్సలు అత్యధికంగా (మొదటి స్థానం) నమోదయ్యాయి. ఆ తర్వాతి స్థానంలో కేన్సర్ సంబంధ జబ్బులు, మూడో స్థానంలో గైనిక్ సంబంధ చికిత్సలు, నాలుగో స్థానంలో హృద్రోగ సంబంధ చికిత్సలు ఉన్నాయి. ఇదిలా ఉంటే ఈ పథకంలో 1,835 రకాల జబ్బులకు చికిత్సలు అందిస్తుండగా, వీటిలో 1,375 చికిత్సలకు సంబంధించిన ప్యాకేజీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. 40 ప్రైవేటు ఆస్పత్రుల్లో నెలకు సగటున 2,500 నుంచి 2,700 చికిత్సలు జరుగుతున్నాయి. కేవలం 11 నెలల్లోనే 43,070 మంది వివిధ జబ్బులకు చికిత్సలు చేయించుకున్నారు. ఇందుకు ప్రభుత్వం రూ.114.35 కోట్లు ఖర్చు చేయడం గమనార్హం. ఈ పథకం ద్వారా సాధారణ చికిత్సలే కాదు.. అరుదైన అవయవ మార్పిడి చికిత్సలు చేస్తున్నారు. జిల్లాలో 246 మందికి అవయవ మార్పిడి చికిత్సలు చేశారు. మెజార్టీ చికిత్సలు ప్రైవేటు ఆస్పత్రుల్లోనే జరుగుతుండటం విశేషం.

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చేసిన చికిత్సలు

జబ్బు	చికిత్సలు	ఖర్చు (రూ.కోట్లలో)
కిడ్నీ సంబంధ	11,638	రూ.23.60
కేన్సర్	8,952	రూ.17.89
హృద్రోగ	3,084	రూ.21.97
గైనిక్	3,166	రూ.5.17
పీడియాట్రిక్	2,615	రూ.8.24
న్యూరో	1,232	రూ.6.14
శ్వాసకోశ	642	రూ.2.40
ట్రామా	1,966	రూ.6.93
ఆర్థోపెడిక్	598	రూ.1.74
నేత్ర వైద్య	1,745	రూ.2.10
జనరల్‌మెడిసిన్/సర్జరీ	3,668	రూ.7.80
ఉదరకోశ	934	రూ.3.25
తలసీమియా	898	రూ.1.34

జీవనశైలిని మార్చుకోవడమే మార్గం



పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రజల జీవనశైలి, ఆహారపు అలవాట్లు పూర్తిగా మారిపోయాయి. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన ఫాస్ట్‌ఫుడ్ కల్చర్ ప్రస్తుతం పల్లెలకు విస్తరించింది. ఉరుకుల పరుగుల జీవితం, ఇంట్లో వండిన తాజా ఆహారానికి బదులు సింథటిక్ రంగులు, మసాల పౌడర్లు కలిపిన రెడీమేడ్ ఫుడ్‌ను తీసుకోవడం, పని ఒత్తిడికి తోడు కంటి నిండా నిద్ర లేకపోవడం, అర్ధరాత్రి వరకు మద్యం సేవించడం, మాంసాహారాన్ని అతిగా భుజించడం వెరసి చిన్న వయసులోనే పెద్ద జబ్బులను తెచ్చిపెడుతోంది. ఈ అలవాట్లను మార్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. రోజుకు కనీసం 45 నిమిషాలు వ్యాయామం చేయడం ద్వారా మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్, హృద్రోగం, కేన్సర్ వంటి జబ్బులు దరి చేరకుండా చూసుకోవచ్చు.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్యాధికారి

న్యూస్‌రీల్

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి



దీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

తుక్కుగూడ: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని టీపీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కాటన్‌పల్లి కేశవులు, ప్రధాన కార్యదర్శి సత్తారి రాజిరెడ్డి అన్నారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం డీఈఓ సుశీందర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదో తరగతి మూల్యాంకనం నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్, సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న వారికి గౌరవ వేతనం అందజేయాలన్నారు. అదనంగా ఉన్న ఉపాధ్యాయులను అవసరమైన పాఠశాలకు పంపించాలని, ప్రతి పాఠశాలకు ఫిజికల్ డైరెక్టర్‌ను కేటాయించాలని, సర్వశిక్ష అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కారించాలని కోరారు.

ఆయిల్‌పామ్‌తో అధిక ఆదాయం

ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల జిల్లా అధికారి సురేష్



ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

తలకొండపల్లి: ఆయిల్‌పామ్ సాగుతో అధికంగా ఆదాయం ఆర్జించవచ్చని ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల జిల్లా అధికారి సురేష్ అన్నారు. ఎకరాకు 8 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుందని తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం డీఏఓ నర్సింహారావు, ఏడీఏ ఆదిలక్ష్మి, ఉద్యాన అధికారి సౌమ్య, డీజీఎం రామ్మోహనరావుతో కలిసి పర్యటించారు. స్థానికంగా రైతులు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంటలను పరిశీలించారు. అనంతరం రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. రాయితీలతో కూడిన పరికరాలు, 90 శాతం రాయితీతో డ్రిప్ ఇరిగేషన్ అందజేస్తోందని తెలిపారు. నీటి వసతి ఉన్న పొలంలో ఆయిల్ పామ్‌సాగు చేయాలని, ఈ పంటకు చీడపీడల బెడద తక్కువగా ఉంటుందన్నారు. 35 సంవత్సరాల వరకు దిగుబడి వస్తుందన్నారు. సేకరించిన పంటను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కంపెని కొనుగోలు చేస్తుందన్నారు. 80 నుండి 100 శాతం రాయితీతో ప్రతి ఎకరాకు నాలుగేళ్ల పాటు, ఏడాదికి రూ.4,200 మెయింటనెన్స్ ఇవ్వబడుతుందని వివరించారు. రైతులు రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్‌లు రుక్మిణి, శ్రీనివాస్, నవీన్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే చర్యలు

చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య



జేసీబీ సాయంతో ఆక్రమణల తొలగింపు

చేవెళ్ల: ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా కఠిన చర్యలు తప్పవని చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య హెచ్చరించారు. మండలంలోని గుండాలలో మంగళవారం కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని సర్వే నంబర్ 153లో 1.01 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో కొంత భాగం పల్లె ప్రకృతి వనానికి కేటాయించారు. మిగిలిన భూమిని పక్కనే ఉన్న సర్వే నంబర్ 154 పట్టాదారుడైన తాడిచెర్ల దాన్‌శ్రీనివాస్ కుమార్‌రాజా అనే వ్యక్తి ఆక్రమించి తన భూమిలో కలిపేసి ప్రీకాస్టింగ్‌తో ప్రహరీ నిర్మించాడు. ఇటీవల అక్కడికి సర్వేకు వెళ్లిన అధికారులు దీనిని గుర్తించారు. తహసీల్దార్‌తో పాటు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్స్, ఆర్‌ఐ సిబ్బందితో వెళ్లి జేసీబీ సాయంతో ఆక్రమణలను తొలగించారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

గ్రూప్ -2 పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఈ నెల 15,16 తేదీల్లో జరిగే గ్రూప్–2 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయం భవన సముదాయంలో మంగళవారం పరీక్ష నిర్వహణపై పోలీస్, నోడల్, ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 15న రెండు పేపర్లు ఉంటాయని, ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో పేపర్ ఉంటుందన్నారు. 16న ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు రెండో పేపర్ ఉంటుందన్నారు. ఆలస్యంగా వస్తే అనుమతించబోమన్నారు. జిల్లాలో 90 పరీక్షా కేంద్రాల్లో 56,883 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్టు చెప్పారు. అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని కోరారు. అభ్యర్థులు మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులతో పరీక్ష హాలులోకి రాకూడదని సూచించారు. నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి, రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా శాఖల అధికారులు జీరాక్స్ కేంద్రాలు మూసివేసేలా చూడాలని విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, మౌలిక వసతులు కల్పించాలన్నారు. బస్సులు సమయానికి నడిపించాలన్నారు. పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు వహించాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ అమలే లక్ష్యం



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

- మాదిగ జాతి బిడ్డల భవిష్యత్తే ముఖ్యం
- రాజకీయాలకు అతీతంగా పోరాడుదాం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

ఇబ్రహీంపట్నం: మాదిగ జాతి బిడ్డల భవిష్యత్తే తనకు ముఖ్యమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. రాజకీయాలకు అతీతంగా మాదిగ బిడ్డలందరూ రానున్న మూడు నెలల పాటు కలిసికట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వర్గీకరణ అమలే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. నియోజకవర్గ మాదిగల ఆత్మీయ మహాసభను మంగళవారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ధర్మాసనం అనుకూలంగా తీర్పునిస్తే మాల జాతిలోని కొంతమంది స్వార్థపరులు అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా అందరి మద్దతు కూడగట్టుకుని పోరాటం చేశామని గుర్తు చేశారు. ఎట్టకేలకు 20 ఏళ్ల తర్వాత పోరాటం ఫలించి సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని అన్నారు. ఈ తీర్పును అడ్డుకోవాలని కొంతమంది యత్నిస్తున్నారని ఆరోపించారు. వివిధ రాజకీయ పార్టీల నుంచి తనకు ఎన్నో అవకాశాలు వచ్చినా తిరస్కరించానని, తన జాతి ప్రయోజనాల కోసం పోరాటబాటను వీడలేదని.. మెడలోని కండువా మార్చలేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజాగాయకుల ఆటపాటలు అలరించాయి. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసీం, బీజేపీ నాయకుడు బోసుపల్లి ప్రతాప్, బీఆర్‌ఎస్ నాయకులు మంద సురేష్, చంద్రయ్య, యాచారం రవీందర్, మంద సుధాకర్, భరత్‌కుమార్, కొండ్రు ప్రవీణ్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన తప్పనిసరి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి



విద్యార్థులతో సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

అబ్దుల్లాపూర్‌మెట్: విద్యార్థులు హైస్కూల్ స్థాయి నుంచే చట్టాలు, మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేటికీ కొంతమందికి మానవ హక్కులపై సరైన అవగాహన లేదన్నారు. ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిక్కర గోపీ శంకర్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని వాటిని సాకారం చేసుకోవడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్ కుమార్, ఎస్‌ఐ కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాదిగ రిజర్వేషన్లను అమలు చేయాలని వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాజ్యాంగ ఫలాలు అందరికీ దక్కాలి

- జనాభా ప్రాతిపదికన వర్గీకరణ చేపట్టాలి
- ఏకసభ్య కమిషన్‌కు విన్నవించిన కుల సంఘాలు

ఇబ్రహీంపట్నం రూరల్: రాజ్యాంగం కల్పించిన ఫలాలను సమానంగా పంచాలని ఎస్సీ వర్గీకరణపై అధ్యయనం చేసేందుకు వచ్చిన తెలంగాణ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి డాక్టర్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్‌కు కుల సంఘాలు విజ్ఞప్తి చేశాయి. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

సుప్రీంకోర్టు నిర్ణయానికి కట్టుబడాలి

రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయాలని మాదిగ, మాదిగ ఉపకులాల నేతలు డిమాండ్ చేశారు. మాదిగలు స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబాటుకు గురవుతున్నారని తెలిపారు. కలిసి ఉండి రిజర్వేషన్లు పంచుకుందామని అభిప్రాయం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు నిర్ణయానికి అందరం కట్టుబడి ఉండాలని, త్వరితగతిన ఆదేశాలను అమలు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగ, మాదిగ ఉప కులాలకు న్యాయం చేయాలన్నారు.

సంచార జాతులను ప్రత్యేకంగా గుర్తించండి

మాదిగ ఉప కులాలైన డక్కలి, సింధు, మాష్టిలతో పాటు ఇతర సంచార జాతులను ప్రత్యేక కేటగిరీగా గుర్తించాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఇప్పటి వరకు అభివృద్ధి చెంది రిజర్వేషన్లు పొందిన వారికి కాకుండా తమలాంటి అణగారిన వర్గాలకు పూర్తి హక్కులు కల్పించాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలతో పాటు అన్ని రంగాల్లో ప్రాధాన్యం కరువైందని.. తమను కనీసం మనుషులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

7 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

మాదిగ ఉప కులంలో ఉండి బ్రాహ్మణులతో సమానంగా పౌరోహిత్యం చేస్తూ గ్రామదేవతలను పూజించే కులం తమదని బైండ్ల హక్కుల సంఘం నేతలు అన్నారు. విద్యారంగంలో కూడా వెనుకబాటుకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో తమకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాలు స్పందించాలని కోరారు. 7 శాతం రిజర్వేషన్లు ఇస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

వర్గీకరణతో లాభం లేదు

మాలలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, జనాభా ప్రకారం వర్గీకరణ చేస్తే సరిపోదని మాల సంఘం నేతలు అన్నారు. ఏకసభ్య కమిషన్ సమావేశాలను మండలాలు, గ్రామాల వారీగా నిర్వహించాలని సూచించారు. మరింత ప్రచారం చేసి అభిప్రాయాలు సేకరించాలని విజ్ఞప్తి చేశారు. వర్గీకరణతో నష్టం తప్ప లాభం లేదని స్పష్టం చేశారు. రిజర్వేషన్లు పెంచాలని, ఈ మేరకు పార్లమెంట్‌లో తీర్మానం చేస్తే బాగుంటుందని తెలిపారు.

ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

ఆటవిక జాతి అయిన తాము 75 సంవత్సరాలుగా వెనుకబడి ఉన్నామని మాదాసీ కురవలు తెలిపారు. 30 లక్షల మంది వరకు ఉన్న తమకు ఇప్పటికీ బీసీ సర్టిఫికెట్లు ఇస్తున్నారని, ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు.

పోచారంలో ఏకసభ్య కమిషన్ పర్యటన

ఇబ్రహీంపట్నం మండలం పోచారంలోని ఎస్సీ కాలనీలో వర్గీకరణ అధ్యయన ఏకసభ్య కమిషన్ డాక్టర్ షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలో పర్యటించారు. మాల, మాదిగ, బైండ్ల కులస్తుల స్థితిగతులను పరిశీలించారు. పిల్లల చదువులు, జీవన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్, రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, జిల్లా సంక్షేమశాఖ అధికారి రామారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గురుకులాల మల్టీజోనల్ ఆఫీసర్ రజిని

రాష్ట్ర గురుకులాల మల్టీజోనల్ ఆఫీసర్ రజిని

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థినులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రాష్ట్ర గురుకులాల మల్టీజోనల్ ఆఫీసర్ రజిని అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం సమీపంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ విద్యుల్లత ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవాల్లో భాగంగా సీఎం కప్–2024 నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 19న కమ్మదనం బాలికల గురుకుల పాఠశాలలో రాష్ట్ర జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ పోటీల్లో అన్ని మండలాలల నుంచి దాదాపు 1,200 మంది విద్యార్థినులు పాల్గొననున్నట్టు వివరించారు. పోటీలను ప్రారంభించేందుకు రాష్ట్ర గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి హాజరవుతారన్నారు. విద్యార్థినులకు కావాల్సిన వసతులు కల్పించాలని సూచించారు. స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతం చేసేందుకు గురుకులాల అధికారులు, ప్రిన్సిపాళ్లు, పీడీ, పీఈటీలు కృషి చేయాలన్నారు. సమావేశంలో గురుకులాల స్టేట్ ఆఫీసర్ భీమయ్య, జోనల్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ రాణి, నిర్మల, వివిధ గురుకులాల ప్రిన్సిపాళ్లు, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

కుంట్లూరు పెద్ద చెరువు సర్వే

స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి హైడ్రా అధికారులు



సర్వేలో పాల్గొన్న హైడ్రా, రెవెన్యూ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని కుంట్లూరు పెద్ద చెరువును హైడ్రా అధికారులు సర్వే చేశారు. సర్వేనంబర్ 185లో సుమారు 96 ఎకరాల్లో ఉన్న చెరువు భూమిలో మున్సిపాలిటీ నుంచి రూ.20 లక్షలు కేటాయించి ప్రైవేటు వ్యక్తులకు చెందిన వ్యవసాయ భూమి వద్దకు సీసీ రోడ్డు వేసేందుకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, బంధువులు, కమిషనర్ సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. ఇది పూర్తిగా అక్రమాలకు తావిచ్చేలా ఉందని, ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, కేవలం వ్యవసాయ భూమి వద్దకే రోడ్డు వేసేందుకు చెరువు స్థలాన్ని కబ్జా చేస్తున్నారని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కళ్లెం ప్రభాకర్ రెడ్డి, కళ్లెం వెంకట రెడ్డి తదితరులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు మంగళవారం తమ సిబ్బందితో చెరువును సర్వే చేయించారు. స్థానికంగా భూములున్న కొందరు అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు జోక్యం చేసుకొని అక్కడి నుంచి పంపించారు. హైడ్రా అధికారుల వెంట అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డితో పాటు సిబ్బంది ఉన్నారు. కాగా బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెరువును పరిశీలించే అవకాశం ఉన్నట్లు సమాచారం.



ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందజేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు

రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజేందర్‌గౌడ్

మొయినాబాద్/మొయినాబాద్ రూరల్: ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లుగా ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజేందర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యకు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం రైతుల సమస్యలు పరిష్కరించాలని.. రుణమాఫీకి రేషన్ కార్డు లింకును తొలగించాలని కోరారు. రైతులు వాడుతున్న ట్రాక్టర్ ట్రాలీలకు 15 సంవత్సరాల లైఫ్ నిబంధన ఎత్తివేయాలన్నారు. రైతు భరోసా గత రెండు విడతలుగా రూ.15 ఇవ్వలేదని.. వాటిని వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలన్నారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతుల సమస్యలు పరిష్కరించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు సత్యనారాయణరెడ్డి, పెంటారెడ్డి, యాదవరెడ్డి, వెంకట్‌రెడ్డి, వీరేశం, బసవరాజ్, కృష్ణ, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జన ఔషధ కేంద్రాలతో ప్రయోజనం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి



జన ఔషద కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ప్రధానమంత్రి జన ఔషధ కేంద్రాలతో పేదలకు ప్రయోజనం చేకూరుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పద్మావతి కాలనీలో సిల్వేరి భిక్షపతి నూతనంగా ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి జన ఔషధ కేంద్రాన్ని మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జన ఔషధ కేంద్రాతో దీర్ఘకాలికంగా మందులు వాడుతున్న వారికి మేలుచేకూరుతుందన్నారు. ఇతర మెడికల్ దుకాణాలతో పోలిస్తే దాదాపు 90 శాతం తక్కువ ధరలకు మందులను ఇస్తారని అన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు జన ఔషధ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోహన్‌సింగ్, వంశీకృష్ణ, లష్కర్‌నాయక్, మఠం రుషికేష్, హరిభూషణ్, బాల్‌రాజ్, బాల్‌రెడ్డి, ప్రవీణ్, నారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

మహిళలను ఢీకొట్టిన బైక్

ముగ్గురికి తీవ్ర గాయాలు

తలకొండపల్లి: నడుచుకుంటూ వెళ్తున్న మహిళలను బైక్ ఢీకొట్టడంతో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని హర్యానాయక్ తండాకు చెందిన నరేశ్ బైక్‌పై ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో శివాజీ చౌక్ వద్ద షాద్‌నగర్–ఆమనగల్లు రోడ్డుపై లక్ష్మమ్మ, అలివేలు నడుచుకుంటూ వెళ్తుండగా వారిని బైక్‌తో వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మహిళలతో పాటుగా నరేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

భార్యతో గొడవ పడిన భర్త బలవన్మరణం



విజయ్‌కుమార్ మృతదేహం

చేవెళ్ల: భార్యతో గొడవ పడిన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని ధర్మసాగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన విజయ్‌కుమార్(33) టైలర్. ఆయన భార్య సుమలతతో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. తగాదా జరిగిన ప్రతీసారి చనిపోతానని బెదిరించేవాడని.. గతంలోనూ రెండు సార్లు సెల్ టవర్ ఎక్కి బెదిరించాడని చెప్పారు. ఈ క్రమంలో మంగళవారం కూడా భార్యతో గొడవపడిన విజయ్‌కుమార్ గ్రామ సమీపంలో ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుడి తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

పది బైక్‌లు స్వాధీనం

ఆమనగల్లు: పట్టణంలో మంగళవారం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్ నేతృత్వంలో కేశంపేట సీఐ నరహరి, ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, కేశంపేట ఎస్‌ఐలు వెంకటేశ్, శ్రీకాంత్, వరప్రసాద్, రాజ్‌కుమార్, నలుగురు ట్రైనీ ఎస్‌ఐలు, 40 మంది పోలీసులు స్థానిక పట్టణంలోని హోటల్స్, దాబాలు, కిరాణా షాపులు, పాన్‌షాపులను తనిఖీ చేశారు. ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో నాలుగు మద్యం కేసులు, ఒక నిషేధిత గుట్కా విక్రయం కేసు నమోదు చేయగా బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఆరుగురిపై కేసు నమోదు చేశారు. వాహన తనిఖీల్లో సరైన పత్రాలు చూపకపోవడంతో పది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ.. అక్రమంగా మద్యం, గుట్కా, ఇతర నిషేధిత హానికర పదార్థాలు అమ్మినా, నిలువ ఉంచినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బైక్‌ను ఢీకొట్టిన స్కూల్ బస్



ఘటనా స్థలిలో మహ్మద్ ఇమ్రాన్ మృతదేహం



నుజ్జునుజ్జయిన బైక్



ఇమ్రాన్ (ఫైల్)

సెంట్రింగ్ కార్మికుడి దుర్మరణం

చేవెళ్ల: ప్రైవేట్ స్కూల్ బస్ ఓ బైక్‌ను ఢీకొట్టడంతో ఓ సెంట్రింగ్ కార్మికుడు ఘటనా స్థలిలోనే మృతి చెందాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్కేపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఊరేళ్ల అనుబంధ గ్రామమైన మొండివాగుకు చెందిన మహమ్మద్ ఇమ్రాన్(22) సెంట్రింగ్ కార్మికుడు. పని నిమిత్తం ఉదయం 7గంటల ప్రాంతంలో తన బైక్‌పై ఎన్కేపల్లివైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చేవెళ్లలోని శ్రీసత్యసాయి గ్రామర్ హైస్కూల్‌కు చెందిన బస్ గ్రామాల్లో విద్యార్థులను తీసుకువచ్చేందుకు వెళ్తోంది. మార్గమధ్యలో ఎన్కేపల్లికి సమీపంలో స్కూల్ బస్సు, బైక్ రెండు ఎదురెదురుగా వేగంగావచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో ఇమ్రాన్ బైక్‌పై నుంచి ఎగిరి పడడంతో తలకు బలమైన గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి నయీం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఆరు నెలల క్రితమే వివాహమైంది. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

టిప్పర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి..

- ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన బైక్
- యువకుడి దుర్మరణం



ప్రశాంత్ కుమార్ (ఫైల్)



బస్సు కిందుకు దూసుకెళ్లిన బైక్

మంచాల: టిప్పర్‌ను ఓవర్‌టేక్ బోయిన ద్విచక్ర వాహనదారుడు ఆగిఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మంచాల సీఐ మధు తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండకు చెందిన కొమ్ము ప్రశాంత్‌కుమార్(24) స్థానికంగా ఓ ఫర్టిలైజర్ దుకాణంలో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి నగరంలో పని ఉందని చెప్పి యజమాని శ్రీశైలం బైక్ తీసుకుని హైదరాబాద్‌కు బయలుదేరాడు. సాగర్ హైవేపై ఆగాపల్లి వద్దకు రాగానే టిప్పర్‌ను ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో ఎదురుగా ఆగిఉన్న ఇబ్రహీంపట్నం డిపో బస్సును ఢీకొట్టాడు. దీంతో తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఇబ్రహీంపట్నంలోని లిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం నగారానికి తీసుకెళ్లాలని సూచించారు. హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రశాంత్ మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పనికి తగ్గ గుర్తింపు ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పనులను అమలు చేస్తున్న తమకు సరైన గుర్తింపు లేదని, పనికి తగ్గ గుర్తింపు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ, సంక్షేమ పథకాల అమలులో కార్యదర్శుల పాత్ర గొప్పదన్నారు. సెలవు దినాల్లో మినహాయింపు ఇవ్వాలని, ట్యాబ్‌లు అందజేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



సాయి (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: శుభకార్యానికి వెళ్లి వస్తుండగా వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘట న షాద్‌నగర్ ఠాణా పరిధిలో మంగళవారం వెలుగుజూసింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం తిమ్మాయిపల్లికి చెందిన మరికంటి సాయికుమార్, భార్గవి దంపతులు నగరంలోని బేగంపేట పరిధి ప్రకాశ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. సాయికుమార్ బైక్‌మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 6న సాయికుమార్ దంపతులు వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిధిలోని కాళ్లాపూర్‌లో బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లారు. 7న హైదరాబాద్‌కు తిరిగి వస్తున్న క్రమంలో షాద్‌నగర్‌లోని కేశంపేట రోడ్డులో ఉంటున్న బంధువు వెంకటేశ్‌తో ప్లాట్ విషయం మాట్లాడి వస్తానని భార్యను హైదరాబాద్‌కు వెళ్లమన్నాడు. దీంతో భార్గవి ప్రకాశ్‌నగర్‌కు వెళ్లిపోయింది. సాయికు మార్ ఇంటికి రాకపోవడంతో ఆమె తిమ్మాపల్లికి ఫోన్ చేసింది. అక్కడకు రాలేదని చెప్పడంతో బంధువులతో పాటుగా వెంకటేశ్‌ను అడిగినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్గవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

హక్కులను కాపాడుకుందాం

వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభుదాను



వినతిపత్రం అందజేస్తున్న ప్రభుదాసు

కొందుర్గు: దళిత, బహుజనుల హక్కులను కాపాడుకుందామని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభుదాసు అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ప్రకాశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుదాసు మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేదలు, బడుగు బలహీన వర్గాలు, మహిళల అభ్యున్నతి కోసం ఎన్నో హక్కులు కల్పించినా.. ఆచరణలో సాధ్యం కావడం లేదన్నారు. సమాజంలో ప్రతీ ఒక్కరు సమానంగా జీవనం సాధించేలా ప్రభుత్వాలు కృషిచేయాలని డిమాండ్ చేశారు. నేటికి దళితులపై, మహిళలపై దాడులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దాడులు జరుగకుండా ప్రభుత్వం కఠినమైన చట్టాలు అమలులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి వెంకటేశ్వరమ్మ, నాయకులు శ్రీనివాసులు, అశోక్ కుమార్ రెడ్డి, నర్సింలు, శాంతమ్మ, మంగమ్మ, వెంకటయ్య పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



ఎస్ఎస్ఏ ఉద్యోగుల దీక్షలో సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: సమగ్ర శిక్షా ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరహార దీక్షలు మంగళవారం మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. పాఠశాల సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, తక్షణమే పేస్కేల్ అమలు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలన్నారు. జీవిత బీమా, ఆరోగ్య భద్రత కల్పించాలని, ప్రాణాలు కోల్పోయిన సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. పదవీ విరమణ చేసిన వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ప్రకటించాలన్నారు. వీరి ఆందోళనకు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య, సామేలు, ప్రకాష్‌కారత్, ఆనంద్ సంఘీభావం తెలిపారు.

సంఘటితంగా పోరాడాలి

బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్



నియామక పత్రాలు అందిస్తున్న శ్రీనివాస్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలని బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బీసీ మహాసభ జిల్లా అధ్యక్షుడు క్యూసెట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మెట్టుకాడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సబ్బండ కులాలకు కావాల్సిన అవసరాలు, సంక్షేమ పథకాలను సాధించుకోవాలంటే ఐక్యమత్యంతో ఉద్యమించాలని అన్నారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలు అభివృద్ధి చెందాలని అన్నారు. బీసీలు రాజ్యాధికారంతో చట్టసభల్లో ప్రవేశించినప్పుడే మన హక్కులను సాధించుకుంటామని అన్నారు. రిజర్వేషన్‌లలో మనకు రావాల్సిన వాటాను దామాషా ప్రకారం సాధించుకొని మన నిధులు, అవకాశాలను చేజిక్కించుకోవాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో మనకు మనమే పోటీ కాకుండా మన ఓట్లను మనమే వేసుకొని విజయం సాధించాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. బీసీ మహాసభ జిల్లా సలహాదారులుగా అందె పైలయ్య, మంగ వెంకటేశ్, జిల్లా కార్యదర్శిగా మాధవాచారి, జిల్లా యువత విభాగం కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటి సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, జిల్లా యువతవిభాగం అధ్యక్షుడు ఏపీఎం శ్రీధర్ వర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా భరత్, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా ప్రచార ఇన్‌చార్జి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్.. బడి బస్సు!



డ్రైవర్ల ర్యాష్ డ్రైవింగ్‌తో విద్యార్థుల బెంబేలు

ఇటీవల తరచూ ప్రమాదాలు

- ప్రశ్నార్థకంగానే స్కూల్ బస్సుల సామర్థ్యం
- కొరవడిన ఆర్టీఏ అధికారుల నియంత్రణ

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో బడి బస్సులు భయపెడుతున్నాయి. బస్సుల నిర్వహణలో పాఠశాలల యాజమాన్యాల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం పిల్లలకు, వాహనదారులకు శాపంగా మారుతోంది. బడి బస్సుల డ్రైవర్లు ర్యాష్ డ్రైవింగ్‌తో బెంబెలెత్తిస్తున్నారు. సోమవారం మేడ్చల్ సమీపంలో ఓ స్కూల్ బస్సు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఉదంతం పిల్లలను, తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. అదృష్టవశాత్తూ చిన్నారులు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల తరచూ ఎక్కడో ఒక చోట ర్యాష్ డ్రైవింగ్ కారణంగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి.

నిర్లక్ష్య డ్రైవింగ్..

స్కూల్ బస్సులను నడిపేందుకు కనీసం అయిదేళ్ల అనుభవం కలిగిన వారినే డ్రైవర్లుగా నియమించాలి. కానీ.. అంతగా అనుభవం లేనివాళ్లను, అరకొర అవగాహనతో బస్సులను నడిపేవారిని ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గతంలో బీఎస్‌రెడ్డి నగర్, హబ్సీగూడ ప్రాంతాల్లో బస్సు డ్రైవర్ల నిర్లక్ష్యం ఇద్దరు చిన్నారుల ప్రాణాలను బలిగొంది. ఈ రెండు చోట్ల బస్సు వెనక చక్రాల వద్ద ఆడుకుంటున్న పిల్లలను గమనించకుండా రివర్స్ చేయడం వల్ల పిల్లలు మృత్యువాత పడ్డారు. డ్రైవర్‌కు బస్సును అప్పగించే సమయంలోనే పాఠశాల యాజమాన్యం అతని అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొంటే ప్రమాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుంది. మరోవైపు పిల్లలను సకాలంలో స్కూళ్లకు చేరవేయాలనే ఒత్తిడి వల్ల కూడా కొందరు డ్రైవర్లు ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇరుకు రోడ్లపై ఇష్టారాజ్యంగా బస్సులు నడుపుతూ భయపెట్టేస్తున్నారు.

ప్రశ్నార్థకంగా బస్సుల సామర్థ్యం..

- సాధారణంగా ప్రతి ఏటా స్కూళ్లు, కాలేజీలు ప్రారంభమయ్యే సమయానికి రవాణా అధికారులు వాటి సామర్థ్యాన్ని పరీక్షించాలి. పిల్లల కోసం బస్సులను వినియోగించేందుకు అవి అనుకూలంగా ఉన్నాయా? లేదా? అనేది ధ్రువీకరించాలి. ప్రతి సంవత్సరం సామర్థ్య పరీక్షలు జరుగుతూనే ఉన్నాయి. ఈ ఏడాది కూడా బడి బస్సులకు పరీక్షలు నిర్వహించారు. కానీ వాటి సామర్థ్యాన్ని కచ్చితంగా అంచనా వేయడంలోనే నిర్లక్ష్యం కనిపిస్తోంది. కొందరు అధికారులు బస్సులు ఎలా ఉన్నా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను ఇచ్చేస్తున్నారు.
- సామర్థ్య ధ్రువీకరణలో కచ్చితమైన ప్రమాణాలను పాటించడం లేదు. మరోవైపు సామర్థ్య పరీక్షలకు రాకుండా తిరిగే బస్సులపై దాడులు చేసి తగిన చర్యలు తీసుకోవడంలోనూ ఇదే నిర్లక్ష్యం కనిపిస్తోంది. గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాల్లో సుమారు 1,2000కు పైగా స్కూల్ బస్సులు ఉన్నాయి. వీటిలో ఇంకా కొన్ని సామర్థ్య ధ్రువీకరణకు దూరంగానే ఉన్నట్లు సమాచారం. మొదట్లో 15 రోజుల పాటు తనిఖీలు నిర్వహించిన అధికారులు ఆ తర్వాత స్పెషల్ డ్రైవ్‌లను విస్మరించారు. పిల్లల భద్రత, రహదారి భద్రత దృష్ట్యా ఈ బస్సులపై నిరంతరం నిఘా ఉండాలి. కానీ రవాణా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ నిఘా లోపిస్తోంది.

పేరెంట్స్ కమిటీ పనితీరు..

- బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఉండాలి. అవసరమైన ఫస్ట్ ఎయిడ్ మందులు, ఇతర పరికరాలు కూడా ఉండాలి. బస్సుల తనిఖీల సమయంలో మాత్రమే వీటిని ఏర్పాటు చేస్తున్నారు.
- బస్సుల నిర్వహణ, డ్రైవర్ పనితీరుపై పిల్లల తల్లిదండ్రులు కూడా ఓ కన్నేసి ఉంచడం మంచిది. ఎలాంటి సందేహాలు ఉన్నా స్కూల్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడం వల్ల ప్రమాదాలను అరికట్టేందుకు అవకాశం ఉంటుంది.

డ్రైవర్ల ఎంపిక ఎంతో ముఖ్యం

- మోటారు వాహన చట్టం ప్రకారం స్కూల్ బస్సు డ్రైవర్ వయసు 60 ఏళ్లకు మించకుండా ఉండాలి. కానీ.. చాలా స్కూళ్లు ఈ నిబంధనను ఉల్లంఘిస్తున్నాయి.
- పాఠశాల యాజమాన్యం ప్రతి డ్రైవర్ ఆరోగ్య పట్టికను విధిగా నిర్వహించాలి. ఇప్పటి వరకు అలాంటి పట్టికలు ఎక్కడా లేకపోవడం గమనార్హం.
- యాజమాన్యం తమ సొంత ఖర్చులతో డ్రైవర్‌కు 3 నెలలకోసారి రక్తపోటు, షుగర్, కంటి చూపు వంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలనే నిబంధన కూడా అమలుకు నోచుకోవడం లేదు.
- డ్రైవర్‌ను నియమించేందుకు ముందు అతని అర్హతలు, డ్రైవింగ్ లైసెన్స్ తతదితర అంశాలపై సంబంధిత ఆర్టీఏ అధికారులను సంప్రదించాలి. డ్రైవింగ్‌లో కనీసం 5 ఏళ్ల అనుభవం ఉండాలి. కానీ డ్రైవర్ ఎంపికలో విద్యాసంస్థలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు.
- ప్రతి స్కూల్ బస్సుకు డ్రైవర్‌తో పాటు అటెండర్ తప్పనిసరిగా ఉండాలి. పైగా వాళ్లు యూనిఫామ్ ధరించి ఉండాలి.